GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 6 | సంచిక : 226 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | ఆదివారం : మార్చి 31-2024 | పేజీలు : 4

## జమ్ము కశ్మీర్‌కు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి




**టీ మీడియా, మార్చి 30,హైదరాబాద్ :**

దేశవ్యాప్తంగా లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ప్రకటించిన సంగతి తెలిసిందే.ఎన్నికలు సమీపిస్తుండడంతో ఆయా పార్టీలు గెలుపే లక్ష్యంగా వ్యూహాలు రచిస్తున్నాయి. ఈ క్రమంలో జమ్ము కశ్మీర్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనున్నారు. జమ్ము కాశ్మీర్ ఎన్నికల ప్రచారంలో 27 మంది స్టార్ కాంపేయనర్లు పాల్గొన్నారు. అందుకు సంబంధించిన జాబితాను ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కే.సీ వేణుగోపాల్.. కేంద్ర ఎన్నికల సంఘం కార్యదర్శికి అందజేశారు. ఇక ఆ జాబితాలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక వాద్రా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తదితరులు ఉన్నారు. ఇక కేంద్ర పాలిత ప్రాంతం జమ్ము కాశ్మీర్‌లో ఏప్రిల్ 19న ఉదంపూర్‌లో.. ఏప్రిల్ 26న జమ్ములో.., మే 7న అనంతనాగ్, రాజోరీల్లో.., మే 13న శ్రీనగర్‌లో.., మే 20న బారాముల్లాలో జరగనున్నాయి

### కారుని ఖాళీ చేస్తున్న...

# కాంగ్రెస్, కాషాయం...




**ఎన్నికల వేళ ఉత్కంఠభరిత రాజకీయం**

**రోజు రోజుకు దిగజారు తున్న పార్టీ పరిస్థితి**

**టీ మీడియా, మార్చి 30,హైదరాబాద్:**


రాజకీయాల్లో ఎలా గెలిచామన్నది కాదు..గెలిచామా లేదా అన్నదే ఆల్టిమేట్. ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే చేస్తోంది. కాంగ్రెస్సే కాదు.. ఆల్ పార్టీస్‌ది ఇదే లెక్కాపత్రం. గెలుపే ముఖ్యం కానీ..ఎలా గెలిస్తే ఏంటి. లోక్‌సభ ఎన్నికలకు షెడ్యూల్ రిలీజయింది. వెంటనే కాంగ్రెస్ గేట్లు ఓపెన్ చేసింది. ఇంకేముంది అధికారం లేకపోతే కునుకు పట్టని నేతలంతా క్యూ కట్టారు. కాంగ్రెస్‌లో విలీనమైపోతున్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్ నుంచి వస్తున్న నేతలకు లెక్కాలేదు. గులాబీ బాస్?కు అత్యంత సన్నిహితులుగా పేరుబడ్డ నాయకులు కూడా గాంధీభవన్‌కు పయనమవుతున్నారు.అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన దగ్గరి నుంచి గులాబీ పార్టీ పరిస్థితి రోజు రోజుకు దిగజారుతోంది.

మిగతా 2 లో



# కారుని ఖాళీ చేస్తున్న...

# కాంగ్రెస్, కాషాయం...



## ఎన్నికల వేళ ఉత్కంఠభరిత రాజకీయం

## రోజు రోజుకు దిగజారు తున్న పార్టీ పరిస్థితి

**టీ మీడియా, మార్చి 30,హైదరాబాద్:**
రాజకీయాల్లో ఎలా గెలిచామన్నది కాదు..గెలిచామా లేదా అన్నదే ఆల్టిమేట్. ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే చేస్తోంది. కాంగ్రెస్సే కాదు.. ఆల్ పార్టీస్‌ది ఇదే లెక్కాపత్రం. గెలుపే ముఖ్యం కానీ..ఎలా గెలిస్తే ఏంటి. లోక్‌సభ ఎన్నికలకు షెడ్యూల్ రిలీజయింది. వెంటనే కాంగ్రెస్ గేట్లు ఓపెన్ చేసింది. ఇంకేముంది అధికారం లేకపోతే కునుకు పట్టని నేతలంతా క్యూ కట్టారు. కాంగ్రెస్‌లో విలీనమైపోతున్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్ నుంచి వస్తున్న నేతలకు లెక్కాలేదు. గులాబీ బాస్‌కు అత్యంత సన్నిహితులుగా పేరుబడ్డ నాయకులు కూడా గాంధీభవన్‌కు పయనమవుతున్నారు.అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన దగ్గరి నుంచి గులాబీ పార్టీ పరిస్థితి రోజు రోజుకు దిగజారుతోంది. కష్టమొచ్చినా నష్టమొచ్చినా కేసీఆర్ వెంటే నడుస్తాం.. పార్టీ మారే ప్రసక్తే లేదు.. అసలు ఆ అవసరమే లేదు.. అంటూ పార్టీ మార్పు వార్తలపై స్పందిస్తూ పెద్ద పెద్ద సవాళ్లు చేస్తున్న నేతలే.. తెల్లారితే కాంగ్రెస్ కండువానో, కాషాయ కండువానో కప్పుకుని కనిపిస్తూ.. షాక్‌లమీద షాక్‌లు ఇస్తున్నారు. పెద్దపల్లి సిట్టింగ్ ఎంపీ వెంకటేష్ నేతతో మొదలైన వలసల ప్రవాహం.. మెల్లమెల్లగా ఊపందుకుని.. ఇప్పుడు జోరుగా నడుస్తోంది. తాజాగా బీఆర్ఎస్‌లో కీలకంగా ఉన్న కే.కేశవరావు కూడా బీఆర్ఎస్‌కు బైబై చెప్పారు.

ఆయన కూతురు హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి కూడా హస్తం గూటికి చేరనున్నారు. అంతేనా కడియం శ్రీహరి కుటుంబం కూడా కారుదిగింది. బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ టికెట్ కడియం కూతురు కావ్యకు ఇచ్చినా ఆమె పార్టీకి రాజీనామా చేశారు. కూతురుతోపాటు తండ్రి కూడా గులాబీకి గుడ్‌బై చెప్పేశారు. ఇలా ఫ్యామిలీ ఫ్యామిలీలు ఇప్పుడు కాంగ్రెస్ జట్టులోకి చేరడంతో కాంగ్రెస్ మరింత బలంగా తయారవుతోంది. లోక్‌సభ ఎన్నికల వేళ..ఇది కచ్చితంగా బీఆర్ఎస్‌ను దెబ్బదీసే తంత్రమే. సామాజిక వర్గాల పరంగానూ చాలా వ్యూహాత్మకంగా కాంగ్రెస్ పక్కపార్టీ నేతలను తనలో కలుపుకుంటోంది.ఇప్పటికే చాలా మంది మాజీలు కూడా కాంగ్రెస్ కండువా కప్పేసుకుంటున్నారు. రాష్ట్రంలో పరిస్థితులు చూస్తుంటే.. సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన మాటలు నిజమవుతున్నట్టే కనిపిస్తున్నాయి. తాను గేట్లు తెరిస్తే.. బీఆర్ఎస్ మొత్తం ఖాళీ అవుతుందని.. కేవలం కేసీఆర్ కుటుంబ సభ్యులు ముగ్గురు నలుగురు మాత్రమే మిగులుతారని.. సంచలన స్టేట్ మెంట్ ఇచ్చారామధ్య. ఇక్కడ ఇంట్రెస్టింగ్ పాయింటేంటే ప్రభుత్వం ఏర్పడిన మొదట్లో.. బీఆర్ఎస్ నుంచి ఎవరొచ్చినా తీసుకునేది లేదని%౽%ఆ ఇంటి మీద పిట్ట ఈ ఇంటి మీద వాలితే కాల్చేస్తా అంటూ వార్నింగ్ ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి.. ఇప్పుడు ఏకంగా గేట్లే ఎత్తేసేశారు. మరోవైపు సునీల్ కనుగోలు టీం కూడా రంగంలో దిగిందని.. పలువురు కీలక బీఆర్ఎస్ నేతలతో టచ్‌లోకి వెళ్తూ.. వారితో మంతనాలు జరుపుతోందని టాక్ నడుస్తోంది. కొంచెం పాజిటివ్ టాక్ ఉన్నా.. సోషల్ మీడియాలో వాళ్లే లీక్ చేసేసి.. వచ్చే వరకు ప్రచారం గట్టిగా నడిపిస్తున్నట్టు తెలుస్తోంది. ఎలాగైతేనేం.. తెలంగాణలో నీటి ఎత్తిపోతల పథకాలు ఎండిపోతున్నా.. నేతల ఎత్తిపోతల ప్రాజెక్టు మాత్రం కళకళలాడుతోంది. చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరారు. చేరడమే కాదు దానంకు సికింద్రాబాద్ ఎంపీ టికెట్ కూడా కేటాయించింది. అంతేకాదు బీఆర్ఎస్ బీజేపీతో జట్టు కట్టబోతోందన్న విషయం కూడా ఇక గ్రేటర్ హైదరాబాద్‌లోని మెజారిటీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని, రేవంత్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ కోసం ఎదురుచూస్తున్నారని కాంగ్రెస్ వర్గాల్లో నడుస్తున్న టాక్. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్‌రావు తదితరులు కూడా వచ్చే వారంలో గ్రాండ్ ఓల్డ్ పార్టీలోకి మారే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌ఎల్పీని కాంగ్రెస్‌లో విలీనం చేయాలనే ప్రతిపాదనతో మరో 24 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా తమతో టచ్‌లో ఉన్నారని సీఎం సన్నిహితులు చెబుతున్నారు. అదే జరిగితే గులాబీ పార్టీ అస్తిత్వ సంక్షోభాన్ని ఎదుర్కొనే అవకాశం ఉంది. 2024లో ఎలాగైనా మెజార్టీ ఎంపీ సీట్లను దక్కించుకోవాలన్న కసి మీదున్న కాంగ్రెస్, ఆపరేషన్ ఆకర్ష్‌ను చాలా వ్యూహాత్మకంగా అమలు చేస్తోంది. మెయిన్‌గా కాంగ్రెస్‌ను వదిలివెళ్లిన లీడర్స్‌ను వెనక్కి రప్పించే పనిలో పడింది. ఆపరేషన్ స్వగృహ చేపడుతూ మాజీ నేతలపై గురిపెట్టింది. అందులో భాగంగానే కేశవరావు ఇంటికి స్వయంగా సీఎం రేవంత్ వెళ్లి చర్చించారు. పార్టీలో చేరేలా చేశారు.ఇది ఆరంభం మాత్రమే ముందుముందు ఇంకా ఎక్కువ మంది జాయిన్ అవుతారంటున్నారు కాంగ్రెస్ నేతలు. తనకు పార్టీలో తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడంతోనే తాను బీఆర్ఎస్‌కు రాజీనామా చేశానంటున్నారు కేకే. సికింద్రాబాద్, మల్కాజిగిరి లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించాలనే పట్టుదలతో ఉన్న రేవంత్ మరో 10 రోజుల్లోగా బీఆర్ఎస్ నుంచి మరికొంత మంది నేతలను కాంగ్రెస్‌లోకి ఆహ్వానించనున్నారు. అంతేకాదు మెదక్, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ ఎమ్మెల్యేలతో ఆయన చర్చలు జరిపినట్లు తెలుస్తోంది.

**పార్లమెంట్ నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ చాలా సెలక్టివ్‌గా నేతలను తీసుకుంటోంది. మాదిగ వర్గానికి ఫేస్గా వరంగల్లో ఉన్న కడియం ఫ్యామిలీని రంగంలోకి దింపబోతోంది. కడియంతో పాటు కడియం కూతురు కావ్య ఇప్పుడు అక్కడ కీలకంగా ఉన్నారు. కావ్య చేరడంతో వరంగల్ ఎంపీ అభ్యర్థి ఎవరనేది కూడా ఇంకా డిసైడ్ కాలేదు. అయితే వరంగల్ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ తరఫున కడియం శ్రీహరి పోటీ చేస్తారని అంతా భావించారు. అయితే ఆ సీటును కావ్యకే కాంగ్రెస్ పార్టీ కేటాయించనున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్‌లోచేరిన వెంటనే.. అభ్యర్థుల జాబితా ద్వారా కావ్య పేరును అధికారికంగా ప్రకటిస్తారని సమాచారం. పార్టీ విధానాలు ప్రజావ్యతిరేకంగా ఉండడంతోనే బీఆర్ఎస్‌ను వీడామన్నది కడియం చెబుతున్న మాట. ఇక రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్నూరుకాపులే లక్ష్యంగా కేకే, దానం నాగేందర్‌లను రంగంలోకి దింపనుంది. ఇలా బలం ఉండి.. బలగం ఉండి గెలిపించే నాయకులకు గాలం వేస్తోంది.ఆదిలాబాద్లో కొనన్న ఇంద్రకరణ్ రెడ్డి. రంగారెడ్డిలో రంజిత్‌రెడ్డి, సునీత మహేందర్ రెడ్డి , పాలమూరులో జితేందరరెడ్డిలను రంగంలోకి దింపింది. చేరుతున్న వారితోనే బీఆర్ఎస్ను బలహీనపరిచేలా కాంగ్రెస్ వ్యూహ రచన చేసింది.**

# వైసిపి, టిడిపిలకు ఓటు వేస్తే...

# బిజెపికి వేసినట్టే



### ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

**టీ మీడియా, మార్చి 30, విజయవాడ :**
వైసిపి, టిడిపిలకు ఓటు వేస్తే బిజెపికి వేసినట్టేనని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. శనివారం విజయవాడలోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కాంగ్రెస్ నేతల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో అభ్యర్థుల ఎంపిక ప్రజాస్వామ్యయుతంగా ఉంటుందని.. ప్రాంతీయ పార్టీల తరహాలో ఎంపిక జరగదని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలిపారు. వైసిపి, టిడిపి ప్రధాని మోడీకి బానిసలుగా మారాయని ఆరోపించారు. ప్రత్యేక హోదా, పోలవరం.. ఏ విషయంలోనూ ఏపీకి న్యాయం జరగలేదన్నారు. ప్రత్యేక హోదా కోసం జగన్ మూకుమ్మడి రాజీనామాలని చెప్పి డ్రామా చేశారని విమర్శించారు. 23 మంది వైసిపి ఎంపీలు ఒక్కరోజు కూడా హోదా గురించి మాట్లాడలేదన్నారు. రాష్ట్రాన్ని, ప్రజల ప్రయోజనాలను జగన్ తాకట్టు పెట్టారని విమర్శించారు. ఏపీలో వైసీపీ, టీడీపీ పార్టీల మోసాలను కాంగ్రెస్ శ్రేణులు ఇంటింటికీ తిరిగి ప్రతి ఒక్కరికీ వివరించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 9 గ్యారెంటీలను ప్రకటించారు.

**ఏపీలో కాంగ్రెస్ పార్టీ 9 గ్యారెంటీలు..**

1. ఏపీకి పదేళ్ల పాటు ప్రత్యేక హోదా%౽% కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే హోదా అమలు
2. మహిళా వరలక్ష్మి పథకం పేరిట ప్రతి పేద మహిళకు నెలకు రూ.8,500
3. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ
4. రైతులకు పెట్టుబడిపై 50 శాతం లాభంతో కొత్త మద్దతు ధర
5. ఉపాధి హామీ కూలీల కనీస వేతనం రూ.400 అందజేత
6. రాష్ట్రంలో కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య
7. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 2.25 లక్షల ఉద్యోగాల భర్తీ
8. ఇల్లు లేని ప్రతి పేద మహిళకు రూ.5 లక్షల పక్కా ఇల్లు
9. అర్హులైన ప్రతి ఒక్కరికీ రూ.4 వేల పింఛను%౽% ఇంట్లో ఎంతమంది అర్హులు ఉంటే అందరికీ పింఛను



## 55 లక్షల కోట్ల నుంచి 205 లక్షల కోట్లకు అప్పును పెంచేశారు

### కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ

**టీ మీడియా, మార్చి 30, న్యూఢిల్లీ:** బీజేపీ నేతృత్వంలోని కేంద్ర సర్కారు 14 లక్షల కోట్ల రుణం తీసుకునేందుకు ప్రయత్నాలు చేస్తోందని, ఆ ప్రతిపాదనలను కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ వద్రా తప్పుపట్టారు. దేశ ప్రజలను ఎందుకు అప్పుల ఊబిలోకి నెట్టివేస్తున్నారని ఆమె ప్రశ్నించారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఆర్థిక సంక్షోభం పెరుగుతున్నట్లు ఆమె చెప్పారు. ఆర్థిక లోటును పూడ్చేందుకు సెక్యూర్టీలను జారీ చేసి రాబోయే ఆర్థిక సంవత్సరానికి సుమారు 14.13 లక్షల కోట్ల రుణం తీసుకోనున్నట్లు ఇటీవల బడ్జెట్ ప్రసంగంలో మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఆ విషయాన్ని ప్రియాంకా గాంధీ తన ఎక్స్ అకౌంట్‌లో ప్రశ్నించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 14 లక్షల కోట్లు అప్పు తీసుకోవాలని ఆర్థిక శాఖ ప్రతిపాదించిందని, ఎందు కోసం ఆ డబ్బు అని ప్రియాంకా ప్రశ్నించారు. స్వంతంత్ర్యం వచ్చిన నాటి నుంచి 2014 వరకు దేశం చేసిన అప్పు 55 లక్షల కోట్లు మాత్రమే అని, కానీ గడిచిన పదేళ్లలో మోదీ సర్కారు ఆ రుణాన్ని 205 లక్షల కోట్లకు చేర్చినట్లు ప్రియాంకా ఆరోపించారు. అంటే మోదీ సర్కారు గత పదేళ్లలో సుమారు 150 లక్షల కోట్ల అప్పు చేసినట్లు తెలిపారు. దేశంలోని ప్రతి పౌరుడిపై 1.5 లక్షల అప్పు ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు.

# కరడుగట్టిన నేరస్తుల అడ్డా

### తీహార్ జైలు ప్రత్యేకతలెన్నో




**టీ మీడియా, మార్చి 30,ఢిల్లీ:**
దేశంలోని కరుడుగట్టిన నేరస్తులంతా ఉండేది తీహార్ జైలులో . సంచలన కేసుల్లో ప్రముఖ వ్యక్తి లేదా మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్ అరెస్ట్ అయ్యారంటే వాళ్ల అడ్డా తీహార్ జైలే. అందుకే ఈ జైలు లోపల బయట హైసెక్యూరిటీతో.. నిరంతరం డేగ కళ్లతో నిఘా ఉంటుంది. దారుణమైన నేరాలకు పాల్పడ్డ రాజకీయ నాయకులు మొదలుకొని నేరం చేసే పారిశ్రామిక వేత్తలు, హంతకులు, ఉగ్రవాదులకు ఇదే కేరాఫ్ అడ్రస్. సంచలనం సృష్టించిన వేలాది కేసుల్లో నిందితులు తీహార్ జైలులోనే ఉన్నారు. ఎంతో మంది రాజకీయ నాయకులు సైతం ఇక్కడ ఊచలు లెక్కబెట్టారు. నేరాలు రుజువు కావడంతో ఎంతోమందిని ఈ జైలులోనే ఉరితీశారు.దేశ రాజధాని ఢిల్లీలో చాణక్యపురి నుంచి ఏడు కిలో మీటర్ల దూరాన ఉన్న తీహార్ గ్రామంలో ఈ జైలు ఉంది. దక్షిణ ఆసియాలోనే అతిపెద్ద కారాగారం. 6 వేల 251 మందికి సరిపడ వసతులున్నా.. ఎప్పుడూ అంతకన్నా ఎక్కువ మంది.. అంటే పదివేలకు మించి ఖైదీలను ఉంచడం చూస్తుంటాం. వీరిలో న్యాయ విచారణను ఎదుర్కొంటున్న అండర్ ట్రయల్ ఖైదీలూ ఉంటారు. ఉదయం 5 గంటలకు చపాతీ, పూరీలు టిఫిన్ గా పెడతారు. మధ్యాహ్నం పప్పు, అన్నం, సబ్జీ పెడతారు. రాత్రికి కూడా ఇదే మెనూ ఉంటుంది. వారానికి రెండుసార్లు ఖీర్ పెడతారు. ఇక ఖైదీలకు ఇక్కడ నాన్ వెజ్ ఫ్రీగా పెట్టరు. వారు కష్టపడిన డబ్బులతో.. క్యాంటీన్‌లో కొనుక్కుని తినాల్సి ఉంటుంది. కోర్టు అనుమతి ఉన్న ఖైదీలకు ప్రత్యేక వసతి, ఇంటి భోజనానికి అనుమతి ఉంటుంది. 2012లో ఢిల్లీ సామూహిక లైంగికదాడి కేసులో ఐదుగురు నిందితులను తీహార్ జైలులోనే ఉరి తీశారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హత్య కేసులో అత్యంత కీలకమైన కేహార్ సింగ్, సత్వంత్ సింగ్‌లను ఈ జైలులోనే నిర్బంధించారు. పారిశ్రామికవేత్తలను బెదిరించి వందల కోట్ల వసూళ్లకు పాల్పడ్డ సుకేష్ చంద్రశేఖర్, ఒలింపిక్ రజత పతక విజేత సుశీల్ కుమార్, కాశ్మీరీ వేర్పాటువాద నేత యాసిన్ మాలిక్ ఇప్పుడు అక్కడే ఉన్నారు. 2 జి స్పెక్ట్రమ్ కేసులో అరెస్ట్ అయిన.రాజా, కనిమొళి.. **లిక్కర్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత.. ఇలా చాలామందిని తీహార్ జైలులోనే ఉంచారు.**

# లోక్‌సభ ఎంపిల్లో 225 మందిపై క్రిమినల్ కేసులు

**టీ మీడియా, మార్చి 30,న్యూఢిల్లీ :**



ప్రస్తుత లోక్‌సభలోని 514 మంది సిట్టింగ్ ఎంపీల్లో 225 మందిపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. ఈ విషయం అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) అధ్యయనంలో వెల్లడైంది. గతంలో ఎంపీలు సమర్పించిన అఫిడవిట్లను విశ్లేషించిన ఎడిఆర్ పలు వివరాలతో ఈ నివేదిక విడుదల చేసింది. అలాగే ఈ నివేదిక ప్రకారం.. ఎంపిల్లో 5 శాతం మంది కోటీశ్వరులు ఉన్నారు. వీరి ఒక్కొక్కరి సంపద రూ.100 కోట్లకు పైమాటే. క్రిమినల్ కేసులు నమోదైన వారిలో 29 శాతం మందిపై హత్య, హత్యాయత్నం, మత విద్వేషాలను రెచ్చగొట్టడం, కిడ్నాప్, మహిళలపై నేరాలకు పాల్పడటం లాంటి తీవ్రమైన కేసులు ఉన్నాయి. మొత్తం 9 మందిపై హత్య కేసులు నమోదుకాగా.. వారిలో ఐదుగురు బిజెపికకి చెందినవారే. 28 మందిపై హత్యాయత్నం కేసులు నమోదైతే.. వారిలో 21 మంది బీజేపీకి చెందినవారే కావడం గమనార్హం. మహిళలపై నేరాలకు సంబంధించి 16 కేసులు, 3 అత్యాచారం కేసులు నమోదయ్యాయి. అలాగే కోటీశ్వర్లలో ఎక్కువ మంది బీజేపీ, కాంగ్రెస్‌లకు చెందినవారే. ధనిక ఎంపీల్లో కాంగ్రెస్‌కు చెందిన నకుల్‌నాథ్ ప్రథమ స్థానంలో ఉండగా.. తర్వాతి స్థానాల్లో డీకే సురేశ్ (కాంగ్రెస్), కనుమూరు రఘురామ కృష్ణరాజు ఉన్నారు. ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఎంపీలపైనే ఎక్కువగా క్రిమినల్ కేసులు నమోదైనట్లు ఏడీఆర్ విశ్లేషణలో తేలింది. ఆయా రాష్ట్రాల్లో సగానికిపైగా ఎంపీలపై కేసులున్నాయి. ఎంపీల విద్యార్హతలను కూడా ఏడీఆర్ తన నివేదికలో పేర్కొంది. 73శాతం మంది ఎంపీలు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినట్లు వెల్లడించింది.

## బీజేపీ అభ్యర్థిపై 242 క్రిమినల్ కేసులు



**టీ మీడియా, మార్చి 30,వయనాడ్ :**
కేరళరాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, ఆ పార్టీ వయనాడ్ అభ్యర్థికే సురేంద్రన్‌పై 242 క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఇందులో 237 కేసులు శబరిమల నిరసనలకు సంబంధించినవే కావడం విశేషం. వయనాడ్ నుంచి పోటీ చేస్తున్న ఆ రాష్ట్ర బీజేపీ చీఫ్‌పై నమోదైన కేసుల వివరాలను ఆ పార్టీకి చెందిన వార్తా పత్రిక ద్వారా వెల్లడించారు. 242 కేసులకు సంబంధించిన వివరాలను మూడు పేజీల్లో ప్రచురించారు. అలాగే ఎర్నాకులం నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి కెఎస్ రాధాకృష్ణన్‌పై కూడా 211 కేసులున్నట్లు అందులో పేర్కొన్నారు. కాగా, కేరళ బీజేపీ అభ్యర్థులైన సురేంద్రన్, రాధాకృష్ణన్, అలప్పుజా అభ్యర్థి శోభా సురేంద్రన్, వటకర అభ్యర్థి ప్రఫుల్ కృష్ణపై నమోదైన కేసుల వివరాలను బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ శుక్రవారం ట్వీట్ చేశారు.


## కేటీఆర్‌పై బంజారాహిల్స్ పీఎస్‌లో క్రిమినల్ కేసు



**టీ మీడియా, మార్చి 30, హైదరాబాద్:**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదయింది. సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ బత్తిన శ్రీనివాస్ రావు అనే కాంగ్రెస్ నేత హనుమకొండ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జీరో ఎఫ్ఐఆర్ నమోదుచేసిన హనుమకొండ పోలీసులు ఆ కేసును బంజారాహిల్స్ పీఎస్‌కు బదిలీ చేశారు. దీంతో కేటీఆర్‌పై ఐపీసీ 504, 505 (2) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి 2,500 కోట్లు కాంట్రాక్టర్లు, బిల్డర్ల వద్ద వసూలు చేసి ఢిల్లీకి పంపించారని కేటీఆర్ తప్పుడు ఆరోపణలు చేశారని, లోక్‌సభ ఎన్నికల తర్వాత బీజేపీలోకి వెళ్తాడని అబద్ధాలు చెప్పి సీఎం స్థాయిని తగ్గించేలా మాట్లాడారని, తద్వారా ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళ్తున్నాయని పేర్కొన్నారు. కేటీఆర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని అందులో కోరారు.

## కాంగ్రెస్‌లో చేరిన జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి

- ఆహ్వానించిన మున్షి, సీఎం రేవంత్ రెడ్డి..



**టీ మీడియా, మార్చి 30,హైదరాబాద్:**
కాంగ్రెస్ పార్టీలో జోష్ మరింత పెరిగింది. చేరికల పర్వం కొనసాగుతుండటంతో ఆ పార్టీ నేతల్లో ఉత్సాహం నెలకొంది. కాంగ్రెస్ గేట్లు ఎత్తేశాం అని.. రేవంత్ రెడ్డి చెప్పడంతోనే.. ఆ పార్టీలోకి ఒక్కసారిగా చేరికల పర్వం మొదలైంది. ముఖ్యంగా హైదరాబాద్ ప్రాంతంలో చేరికలపై దృష్టిసారించిన సీఎం.. ఆ దిశగా ప్రయత్నాలను మొదలుపెట్టారు. ఈ క్రమంలోనే మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కాంగ్రెస్‌లో చేరారు. టీపీసీసీ ఇన్‌ఛార్జ్ దీపాదాస్ మున్షి, టీపీసీసీ చీఫ్, సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో శనివారం విజయలక్ష్మి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా విజయలక్ష్మికి పార్టీ కండువా కప్పి మున్షి, రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. అయితే, కాంగ్రెస్‌లో విజయలక్ష్మి తండ్రి కే కేశవరావు (కేకే) చేరికపై ఇంకా క్లారిటీ రాలేదు. ఆయన రాజ్యసభ పదవీకాలం రెండేళ్లు ఉండటంతో చేరికపై డైలమాలో ఉన్నట్లు చెబుతున్నారు. శుక్రవారం రేవంత్ రెడ్డిని కలిసిన కేకే.. సోనియా గాంధీ సమక్షంలోనే కాంగ్రెస్‌లో చేరుతానని చెప్పారు.ఇదిలాఉంటే.. కడియం శ్రీహరి, ఇంద్రకరణ్ రెడ్డి.. తదితరులు చేరేందుకు కూడా మూహుర్తం ఖారరైనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో స్టేషన్ ఘన్‌పూర్ కార్యకర్తలతో కడియం శ్రీహరి భేటీ అయ్యారు. హైదరాబాద్ మినిస్టర్ క్వార్టర్స్‌లో సమాలోచనలు జరుపుతున్నారు. పార్టీలోకి రావాలని కాంగ్రెస్ తనను ఆహ్వానించిందని కడియం శ్రీహరి చెప్పారు. భవిష్యత్ కార్యాచరణను కార్యకర్తలు తనకే వదిలేశారని కడియం వివరించారు. సాయంత్రం మీడియా సమావేశంలో అన్ని వివరాలు చెప్తానని కడియం శ్రీహరి తెలిపారు.మరోవైపు కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీలోకి రాకను స్టేషన్‌ఘన్‌పూర్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ సింగాపురం ఇందిర పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. 40 ఏళ్లు కాంగ్రెస్‌ను వ్యతిరేకించిన వ్యక్తిని ఎలా పార్టీలో చేర్చుకుంటారని ఆమె ప్రశ్నించారు.

## ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 100 రోజులు ఉపాధి పనులు కల్పించాలి

- కలెక్టర్ డా. కె.శ్రీనివాసులు





**టీ మీడియా, మార్చి 30, మహానంది:**
ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 100 రోజులు ఉపాధి పనులు కల్పించేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని నంద్యాల జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం మహానంది మండలం తమ్మడపల్లె గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను నంద్యాల జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు ఆర్ .రామచంద్ర రెడ్డితో కలిసి తనిఖీ చేశారు.అనంతరం మహానంది ఫారెస్ట్ నర్సరీలో జరుగుచున్న మొక్కల పెంపకం పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనులను, పని కోరిన ప్రతి వారికి పనులు కల్పించాలని, ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 100 రోజులు పనులు కల్పించేలా తగు చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో తాగునీటి సౌకర్యాలకు ఇబ్బందిలేకుండా చర్యలు తీసుకోవాలని, ఆర్డబ్ల్యూఎస్ శాఖ వారికి ఆదేశించారు. మండలంలో ఎన్నికల కోడ్ సంభందించి విధులతో పాటు, ఉపాధి హామీ పనులు, త్రాగు నీరు, విద్యుత్ సౌకర్యాలను పర్యవేక్షించాలని మండల అభివృద్ధి అధికారి, ఈ ఓ ఆర్ డి వారిని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఏపీడీ నంద్యాల క్లస్టర్ బాలాజీ నాయక్, ఎంపిడివో శ్రీనివాసరెడ్డి , ఈ ఓ ఆర్ డి శివ నాగజ్యోతి, ఏపీవో మనోహర్, ఈసీ రామేశ్వర్ రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ పవన్,ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీసులే నిందితులైన వేళ..

- అత్యాచారం, ఫోన్ ట్యాపింగ్, విధినిర్వహణలో అలసత్వం
- సస్పెన్షన్‌లతో సతమతమవుతున్న డిపార్ట్‌మెంట్..!




**టీ మీడియా, మార్చి 30,హైదరాబాద్:**
తెలంగాణ పోలీస్ శాఖకు గ్రహణం పట్టింది. రక్షించాల్సిన పోలీసులే రాంగ్ రూట్?లోకి వెళుతున్నారు. రకరకాల కారణాలతో వివిధ హెూదాల్లో ఉన్న పోలీసులు వివాదాల్లో చిక్కుకుంటున్నారు. యువతిపై అత్యాచారం, ప్రజాప్రతినిధి కుమారుడిని తప్పిన కేసు, ఫోన్ ట్యాపింగ్ కేసు, విధినిర్వహణలో అలసత్వం ఇలా తెలంగాణ పోలీస్ శాఖకు చెరగని మచ్చ తెచ్చిపెట్టాయి. మామూలు పోలీస్ నుంచి ఉన్నతాధికారుల వరకు సస్పెండ్, అరెస్టులు, ఏకంగా జైలు పాలవుతున్నారు. అసలు తెలంగాణ పోలీసు శాఖలో ఏం జరుగుతోందన్న చర్చ మొదలైంది..!క్రమ శిక్షణకు మారుపేరుగా చెప్పుకునే పోలీస్ శాఖలో కొందరి తీరు కంచే చేను మేసిన చందంగా మారుతోంది. ఉన్నతాధికారుల హెచ్చరికలు, సస్పెన్షన్ చర్యలను కొందరు పోలీసులు పెడచెవిన పెడుతున్నారు. ఇంకొందరు బినామీ పేర్లతో కోట్లు గడిస్తూ దర్జాగా కాలం వెళ్ళదీస్తున్నారు. దొరికితే దొంగ.. లేదంట దొర అన్నట్లుగా మారింది. ఈ క్రమలో పలు వివాదాల్లో చిక్కుకున్న పోలీసులు సస్పెన్షన్ వేటుకు గురవుతున్నారు. దీంతో ఆ శాఖలో పెద్ద ఎత్తున ఖాళీలు విపరీతంగా ఏర్పడుతున్నాయి.మహిళపై అత్యాచారం చేసిన కేసులో అప్పటి టాస్క్‌ఫోర్స్‌లో పని చేసిన మారేడుపల్లి ఇన్స్‌పెక్టర్ నర్సింగ్ రావు సస్పెన్షన్ వేటుకు గురై అరెస్ట్ అయిన సంగతి తెలిసిందే! ఇక మాజీ ఎమ్మెల్యే షకీల్ కొడుకు కేసులో లక్షల రూపాయల లంచం తీసుకుంటూ పంజాగుట్ట ఇన్స్‌పెక్టర్ దుర్గారావు ఉద్యోగం పోగొట్టుకున్నారు. డ్యూటీలో నిర్లక్ష్యం సివిల్ మ్యాటర్‌లో తలదూర్చి సైబరాబాద్, హైదరాబాద్ కమిషనరేట్ పరధిలోని పలు పోలీస్ స్టేషన్లలో పని చేసిన సీఐలు, ఎస్ఐలు అధికారుల ఆగ్రహానికి గురై ఇంటి బాటపట్టారు.ఇక ఫోన్ ట్యాపింగ్ కేసు అందరికి తెలిసిందే..! పోలీస్ అధికారి ప్రణీత్ రావు అరెస్ట్ నుండి మొదలుకుని, అడిషనల్ ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న జైలు పాలయ్యారు. తాజాగా ఆ లిస్టులోకి మాజీ టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్ చేరారు. ఈ కేసులో ఇంకా చాలా మంది పోలీస్ అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. దర్యాప్తులో ఒక్కో పోలీస్ అధికారి విషయాలు బయటకు రావడంతో తెలంగాణలో అనేక ప్రాంతాల్లో ప్రస్తుతం డ్యూటీలో ఉన్న పోలీస్ బాస్ లు విచారణ ఎదురుకుంటున్నారు. ఇంకా ఎంత మంది అధికారులు అరెస్ట్ అవుతారో అర్థం కాని పరిస్థితి నెలకొంది.తాజాగా నయీమ్ కేసుపై కూడా పోలీస్ ఉన్నతాధికారులు ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. ఇక ఈ కేసు కూడా ఇన్వెస్టిగేషన్ మొదలైతే చెప్పాల్సిన పని లేదు.. అప్పట్లో నయీమ్‌తో చెట్టాపట్టాలేసుకుని అక్రమ ఆస్తులు కూడాబెట్టారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి కష్టకాలమేనట. సస్పెండ్‌కు గురై మళ్ళీ క్లిన్ చిట్ తో డ్యూటీలో జాయిన్ అయిన అధికారులను మరోసారి విచారించేందుకు పోలీస్ యంత్రాంగం సిద్ధమవుతుందట. ఇలా అనేక అవినీతి, నేర కేసుల్లో పోలీస్ బాసులు జైలుకు వెళ్లడం, జాబ్ పోగొట్టుకోవడం కలవరానికి గురి చేస్తోంది. దీంతో ఆయా పోస్టులకు ఖాళీలు కూడా ఏర్పడుతోంది. భవిష్యత్తులో పోలీస్ శాఖ ఇంకా ఎంత అప్రతిష్ట మూట కట్టుకుంటుందో అని జనం విమర్శలు గుప్పిస్తున్నారు. వడ్డించే వాడు మనవాడు అని తెలిసి అడ్డగోలుగా తింటే అజీర్తి అవ్వడం ఖాయం అంటూ మరికొందరు కరెప్టెడ్ పోలీసులపై కామెంట్లు చేస్తున్నారు. ఏదిఏమైనా జరుగుతున్న పరిణామాలు అరెస్ట్ అవుతున్న పోలీస్ అధికారుల పరిస్థితి చూస్తే చట్టం ఎవరికి చుట్టం కాదు అన్న మాట నిజంలా అనిపిస్తోంది..!



## కూలిన నిర్మాణంలో ఉన్న వంతెన

**టీ మీడియా, మార్చి 30, బులంద్‌షహర్ :**
నిర్మాణంలో ఉన్న వంతెనలో కొంత భాగం కూలిపోయింది. వంతెనపై నిర్మిస్తున్న రెండు బీములు కూలిపోయాయి. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరుగలేదు. ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. గజ్రౌలా గ్రామం నుంచి అమ్రోహాలోని విరంపూర్ గ్రామం వరకు రూ.83 కోట్ల వ్యయంతో గంగా నదిపై బ్రిడ్జి నిర్మిస్తున్నారు. పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (పీడబ్ల్యూడీ), సేతు నిగమ్ పర్యవేక్షణలో వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కాగా, శుక్రవారం అర్ధరాత్రి వేళ వంతెనకు చెందిన రెండు బీములు కూలిపోయాయి. అయితే భారీ గాలితో కూడిన వర్షం వల్ల ఈ సంఘటన జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదని, ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదని చెప్పారు. మరోవైపు నాణ్యత లేని నిర్మాణ సామగ్రిని వినియోగించడం వల్ల ఈ వంతెనకు చెందిన రెండు బీములు కూలినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే అధికారులు వీటిని ఖండించారు.

## బీఆర్ఎస్ నేతల దందాలు ఎక్కువ

- పార్టీ మారక ముందే విమర్శలు
- కడియం కావ్య తీవ్ర విమర్శలు



**టీ మీడియా, మార్చి 30,హైదరాబాద్:**
బీఆర్ఎస్‌పై కడియం కావ్య తీవ్ర విమర్శలు చేశారు. బీఆర్ఎస్ నేతలు దందాలు ఎక్కువ చేస్తుంటారని ఆరోపించారు. పార్టీ మారక ముందే తమపై విమర్శలు చేస్తున్నారన్నారు. రాజయ్య ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తాము ప్రతిపక్షంలో ఉన్నట్లుండేదని చెప్పారు. ఇప్పుడు కూడా అధికారులు తమ మాట వినడం లేదని కావ్య తెలిపారు. ఎన్ని రోజులు ఈ పరిస్థితి అని కడియం శ్రీహరి ఆలోచించారని పేర్కొన్నారు. అందుకే కడియం శ్రీహరి సమక్షంలోనే బీఆర్ఎస్‌పై కావ్య విమర్శలు గుప్పించారు. హైదరాబాద్ మినిస్టర్ క్వార్టర్స్‌లో కార్యకర్తలతో కడియం శ్రీహరి భేటీ అయ్యారు. కాంగ్రెస్ నుంచి వచ్చిన ఆహ్వానంపై సమాలోచనలు జరిపారు. సాయంత్రం పూర్తి వివరాలు వెల్లడిస్తామన్న కడియం శ్రీహరి తెలిపారు. కొంతకాలంగా పార్టీలో నాయకుల మధ్య వచ్చిన విభేదాల కారణంగానే తాము పార్టీ వీడేందుకు సిద్ధమైనట్లు ప్రకటించారు. బీఆర్ఎస్ నుంచి పోటీ చేస్తే తనను గెలిపించే వాతావరణం ఇక్కడ లేదని అయినా పార్టీ టికెట్ ఇస్తే పోటీ చేసేందుకు సిద్ధపడినట్లు పేర్కొన్నారు. తమకు ఎవరూ మద్దతు ఇచ్చే పరిస్థితులు లేని కారణంగానే పోటీ నుంచి తప్పుకున్నట్లు వివరించారు. ఈ విభేదాలు, నాయకుల మధ్య సమన్వయ లోపమే బీఆర్ఎస్ ప్రతిష్ఠను దిగజారుస్తోందని తెలిపారు. తమ నియోజకవర్గాన్నికి ఈ మధ్య కాలంలోనే మాజీ మంత్రి హరీష్ రావు వచ్చినటప్పుడు కూడా సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపించిందన్నారు.

# ఉపాధి హామీ పనిలో భారీగా అవకతవకలు

- ఉపాధి హామీ పైసల్ బుక్కుడే



**టీ మీడియా, మార్చి 30, వనపర్తి బ్యూరో :**
అధికారుల అవినీతి లీలలు, వీళ్ల చేతివాటం మాములు, ఉపాధి పనికి రాకున్నా హాజరు, గవర్నమెంట్ ఉద్యోగైన చనిపోయిన వాళ్ళయినా, ప్రైవేటు ఉద్యోగైన, ముసలి పండు ముసలోలైన, గ్రామ జనాభా ఎంత ఉంటే అంత హాజరు ఫ్రీ ఫ్రీ, అధికారులతో మాట్లాడుకుంటే చాలు ఉపాది హామీ పనికి వెళ్లకుండా మాస్టర్లు, అధికారుల కమిషన్ ఇస్తే చాలు, అధికారులను సంతోషపరిస్తే నిత్యం హాజరు, ఖాతాల్లో డబ్బులు పడినట్లే. ఉపాధి హామీలో అవినీతి దందా, జిల్లా అధికారులకు తెలిసే జరుగుతుందా ? ప్రతి నెల నెల డబుల్ జీతం వనపర్తి జిల్లా ఉన్నతాధికారులు మౌనంగా ఎందుకు ఉంటున్నారు. పేదలకు ఉపాధి కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. ముఖ్యంగా పనులు లేని రోజుల్లో పేదవాళ్లకు ఈ పథకం వారికి ఎంతగానో ఉపయోగపడుతోంది. ఐతే ఇదే పథకాన్ని అదునుగా చేసుకొని కొందరు అధికారులు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారు. అధికారుల అవినీతి లీలలు మామూలుగా లేదంటున్నారు మండల ప్రజలు.వనపర్తి జిల్లా మదనాపురం మండలం ఆజ్జకొల్లు పంచాయతీ గ్రామంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఇక్కడ అధికారుల చేతివాటం సర్కారీ ఉద్యోగైన, ప్రైవేటు ఉద్యోగైన, ముసలి పండు ముసల్లోనైనా, ఊరిలో ఉన్న లేకున్నా, చనిపోయిన బతికిన గ్రామంలో ఎంతమంది అయినా సరే సగం కమిషన్ ఇస్తే చాలు ఉపాధి హామీ పనులకు వెళ్లకుండా సరే డబ్బులు అకౌంట్ లో పడతాయని, కొందరు అధికారులు స్వాహా చేస్తున్నారని గ్రామస్తులు కోరుతున్నారు.ఉపాధి కూలీలకు అన్యాయం జరిగిందని అండిగిన వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ గ్రామాలలో నకిలీ జాబ్‌కార్డులు తయారు చేసి పెద్ద సంఖ్యలో ఉపాధి హామీ పథకంలో ప్రయోజనాన్ని పొందుతున్నారని ఆరోపణలు. అందులో పనికి వచ్చేవారి సంఖ్య సగమైతే పనికి రాకుండానే హాజరు వేయించుకునేవారు సగం ఉపాధి పనికి రాకున్నాసరే కాస్త పలుకుబడి ఉంటే చాలు మీరు పనికి రాకున్నా హాజరు వేయాలంటే ఒక్కసారి పంచాయతీ అధికారులను కలిసి అతడిని సంతోషపరిస్తే చాలు వారి హాజరు నిత్యం పడుతూనే ఉంటుంది. అందరిలాగే పనికి వచ్చినవారితో పాటు రానివారి ఖాతాల్లో సైతం డబ్బులు పడుతున్నాయి. ఇదేమిటని ఎవరైనా నిలదీస్తే అధికారులు తనదైన శైలిలో కూలీలను బెదిరిస్తున్నాడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామంలో చేసిన పనికి కూలీలసంఖ్యకు పొంతనలేకుండా పోయింది.ఈ విషయమై స్పందించాల్సిన వనపర్తి జిల్లా ఉన్నతాధికారులు మౌనంగా ఉండటం పలు అనుమానాలకు, ఆరోపణలకు తావిస్తున్నదని గ్రామస్తులు ప్రజల సంఘాలు ఆరోపిస్తున్నాయి.

ఈ అవకతవకల అవినీతి సమస్య పై గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన ఎంపీడీవో కు ఆజ్జకొల్లు గ్రామస్తులు ఉపాధి హామీ అవినీతిపై ఎంపీడీవో నాగేంద్రం వినతి పత్రం సమర్పించారు. విచారణ చేపడుతున్నట్టు తెలిపారని,ఈ వ్యవహారం అధికారుల కనుసన్నలలోనే జరుగుతుందని గ్రామస్తులు చెబుతున్నారు. పనికి వెళ్లకుండా మాస్టర్లు వేసి తీసుకున్న డబ్బులను రికవరికి చెయ్యాలంటూ ప్రజా సంఘాలు మేధావులు డిమాండ్ చేస్తున్నారు.



## విజయవంతంగా స్వచ్ఛ భారత్ కార్యక్రమం

- నిస్వార్థ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు ప్యార్సాని అరవింద్

**టీ మీడియా, మార్చి 30, వనపర్తి బ్యూరో :**
నెహ్రూ యువ కేంద్రం ఎన్సిసి అలూమిని అసోసియేషన్ సంయుక్తంగా వనపర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన మై భారత్ స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ బాటిళ్లు సేకరించి చెత్తా చెదారాన్ని తొలగించి కళాశాల అవరణాన్ని శుభ్రం చేయడం జరిగింది. ప్రతి ఒక్కరూ మీ యొక్క పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి అని ప్లాస్టిక్ వినియోగం తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని నిస్వార్థ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు ప్యార్సాని అరవింద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు పి. అజిత్, బి. అరవింద్, విద్యార్థిని, విద్యార్థులు రెడ్ క్రాస్ జిల్లా కోఆర్డినేటర్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పుస్తకాలు లక్ష్య సాధనకు ఆయుధాలు

- సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్



**టీ మీడియా, మార్చి 30, వనపర్తి బ్యూరో :**
ప్రాథమికోన్నత పాఠశాల ఉప్పర్‌పల్లి పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు అందజేత . గణపురంలో గణిత ల్యాబ్ నిర్వర్తిస్తూ, ముగ్గురు నిరుపేదలను దత్తత తీసుకున్నందుకు శోభారానికి సన్మానం.పుస్తకాలు లక్ష సాధనకు ఆయుధాలుగా మారుతాయని, విద్యార్థులు అక్షర జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ వ్యాఖ్యానించారు. వనపర్తి జిల్లాలోని ఘనపురం మండల పరిధిలోని సోలిపూర్ యుపిఎస్ పాఠశాలకు విభిన్న రకాల పుస్తకాలను ఉచితంగా వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాలు ఎంత పురోగమించిన, పుస్తక పఠనం అత్యంత శక్తివంతమైన జ్ఞాన సమపార్జనకు నిదర్శనం అని చెప్పారు. ఎందరో మహనీయులు, శాస్త్రవేత్తలు, చరిత్రకారులు పుస్తక పఠనం ద్వారానే అత్యుత్తమ స్థితికి చేరుకున్నారని, సాంకేతికతను అందిపుచ్చుకుంటూ పుస్తక పటనానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రాథమిక స్థాయి నుండి విద్యార్థులకు పాఠ్యాంశాలే కాకుండా సమకాలిక, సామాజిక, శాస్త్రీయ, చరిత్రకు సంబంధించిన పుస్తకాలను చదివించడం ద్వారా పరిజ్ఞానం వయసు పెరిగే కొద్దీ పెంపొందుతుందన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులను స్మార్ట్ ఫోన్ల కంటే పుస్తక పఠనానికి ప్రాధాన్యత ఇచ్చేలా చొరవ చూపాలన్నారు. అంతకుముందు ఐక్యమత్యంగా విద్యార్థులకు విద్యాబోధన అందిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగమణి, ఉపాధ్యాయులు స్రవంతి, శ్రీలత, మంగమ్మ, అఖిల్ తదితరులను ఘనంగా సన్మానించారు అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు శంకర్ గౌడ్ ను సన్మానించారు. కార్యక్రమంలో సాహితీ కళావేదిక జిల్లా సమన్వయకర్త బైరోజు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

### ఉపాధ్యాయ సమాజానికి శోభారాణి ఆదర్శం..

విద్యార్థులు గణిత శాస్త్రం పై అపోహలు అనుమానాలు తలెత్తకుండా గణితాన్ని అలవోకగా నేర్చుకునేందుకు సైన్స్ తరహాలో గణిత ల్యాబ్ ను ఏర్పాటు చేయడం అభినందనీయమని సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్, జిల్లా సమన్వయకర్త బైరోజు చంద్రశేఖర్ అన్నారు. గణపురం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో గణిత ల్యాబ్ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు శోభారాణి, శారదలను ఘనంగా సన్మానించారు. అంతేకాకుండా ముగ్గురు నిరుపేదలను అందులోని అమ్మాయిలను దత్తత తీసుకొని వారి చదువుల బాగోగులు చూస్తున్న శోభారాణి దాతృత్వానికి,, మానవ సమాజానికి ఆదర్శనీయురాలని కొనియాడారు. అలాగే గణపురం బాలికల పాఠశాలకు ఉచితంగా నీటిని చేస్తున్న పాషాను సైతం అభినందించారు.



## సామాజిక ఉద్యమాలకు రాములు మృతి తీరని లోటు

- టి ఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కే.జంగయ్య

**టీ మీడియా, మార్చి 30, వనపర్తి బ్యూరో :**
యుటిఎఫ్ సీనియర్ నాయకులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు యం.రాములు మృతి ఉపాధ్యాయ ఉద్యమంతో పాటు సామాజిక ఉద్యమాలకు తీరని లోటు అని టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కే.జగ్గయ్య అన్నారు. శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందిన రాములు మృతదేహనికి ఆయనతో పాటు టిఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్ రవి ప్రసాద్ గౌడ్, డి.కృష్ణయ్య,నాగేంద్రం పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.మృతుని కుటుంబ సభ్యులను వారు పరామర్శించారు.ఆయన మృతి ప్రజా ఉద్యమాలకు, ప్రగతి శీలశక్తులకు తీరని లోటన్నారు. విద్యార్థి దశ నుంచి విప్లవ భావాలతో, సమర్థమైన ఉపాధ్యాయ వృత్తిలో ప్రశనీయమైన పాత్ర వహించారనిరి,రిటైర్డ్ అయిన ప్రజా ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్నారని అన్నారు. ఆయన సేవలను కొనియాడుతు ఆయన నమ్మిన సిద్ధాంతాన్ని ఆచరణలో అమలు చేసినప్పుడే నిజమైన నివాళ్ళని అన్నారు. ఈ సందర్భంగా టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు బి.వెంకటేష్, శ్రీనివాస్ గౌడ్, తిమ్మప్ప, లక్ష్మణ్ గౌడ్, హనుమంతు, రామన్ గౌడ్, బి నరేందర్, అరుణ, బి శ్రీనివాసులు, మురళి, భగవంతు, బక్కన్న తో పాటు డిటిఎఫ్ నాయకులు ఏసోఫ్, బి. శ్రీనివాసులు, స్వామి ప్రముఖ కవి జనజ్వాల, ఎంఈఓ లు శ్రీనివాస్ గౌడ్, లక్ష్మణ్ నాయక్ తదితరులు నివాళులర్పించారు.

## ప్రతి పోలింగ్ బూత్ లో ఓట్లు సాధించేలా కార్యకర్తలు పని చేయాలి

- బిజెపి జిల్లా అధ్యక్షులు డి. నారాయణ



**టీ మీడియా, మార్చి 30, వనపర్తి బ్యూరో :**
బిజెపి జిల్లా కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో చిమనగుంటపల్లి గ్రామానికి చెందిన యువకులకు జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ కండువా వేసి బిజెపి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ మాట్లాడుతూ మూడవసారి ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ ని చూడాలని ఉద్దేశంతో చిమనగుంటపల్లి గ్రామానికి చెందిన యువకులు భారతీయ జనతా పార్టీలో చేరడం శుభదాయకమని ప్రతి కార్యకర్త కూడా రాబోవు 43 రోజులు నేనే పార్లమెంట్ అభ్యర్థిని అని లక్ష్యంతో పనిచేసి జాతీయ పార్టీ నిర్దేశించిన లక్ష్యం ప్రతి పోలింగ్ బూత్ లో 370 ఓట్లు సాధించేలా ప్రణాళికబద్ధంగా పనిచేయాలని మన అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్ రెండు లక్షల ఓట్ల మెజారిటీతో విజయం సాధించాలని అందులో వనపర్తి నియోజకవర్గం అగ్రభాగాన ఉండేలా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బిజెపి నాయకులు బి కుమారస్వామి బాశెట్టి శ్రీను, పెద్దిరాజు, శ్రీనివాస్ గౌడ్, కదిరే మధు, బొడ్డుపల్లి వెంకటేష్, రవి నాయక్, అరవింద్, మాజీ మండల అధ్యక్షులు ఎద్దుల దేవేందర్, ఓబీసీ మోర్చా అధ్యక్షులు వాకిటి సుదర్శన్, మండల ప్రధాన కార్యదర్శి పోతు శ్రీనివాసులు, వెంకటేష్ నాయుడు, రాము, జైపాల్ రెడ్డి, నవీన్ సాగర్, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారు కే. వెంకటస్వామి,బక్కి స్వామి, బక్కి విజయ్ కుమార్, కందూరి శివ, అరకటం బాలు, ఆరకటం శివ, వాకిటి యాదగిరి, గువల్ల భాస్కర్, పెద్ద బూది గొపాల్, పోతురాజు శేఖర్ బిజెపి పార్టీలో చేరారు.

## ర్వే లైన్ కల సాకారమైంది

- తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్
- డాక్టర్ జిల్లాల చిన్నారెడ్డి



**టీ మీడియా, మార్చి 30, వనపర్తి బ్యూరో :**
ఎన్నో రోజులుగా కలలుకుంటున్న వనపర్తి రైల్వే లైన్ కల సాకారమైంది. తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జిల్లాల చిన్నారెడ్డి కృషి ఫలితంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రైల్వే శాఖ మంత్రిని ఒప్పించి గద్వాల నుంచి వనపర్తి మీదుగా డోర్నకల్ వరకు రైల్వే లైన్ కు గ్రీన్ సిగ్నల్ వచ్చేలా చేశారు. త్వరలోనే ఈ సర్వే పనులు జరుగనున్నాయి.ఈ రైల్వే లైన్ భూ సేకరణ పనులకు ఆమోదం తెలిపిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి వనపర్తి ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇంకో రైల్వే లైన్ గద్వాల నుంచి మాచర్ల, కల్వకుర్తి నుంచి మాచర్ల కానుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లి సంబంధిత శాఖ మంత్రిని కలిసి ఈ రైల్వే లైన్ పనుల మంజూరు కోసం విజ్ఞాపన పత్రం అందజేశారు. అతి త్వరలో ఈ పనులు మంజూరు అవుతాయని ఆశించారు. రెండు రైల్వే లైన్స్ మంజూరుతో డోర్నకల్ లైన్ ద్వారా ఉత్తరాది ముంబై - ఢిల్లీ కనెక్షన్ దొరుకుతుంది. మాచర్ల రైల్వే లైన్ ద్వారా దక్షిణాది కి కనెక్షన్ దొరుకుతుంది.

## మాజీ మహిళ సర్పంచ్ కు వరించిన కీలక పదవి

- చిన్న వయసులో దక్కిన అరుదైన గౌరవం
- కాంగ్రెస్ పార్టీ కోసం నియమ నిబద్ధతతో పనిచేస్తామన్న రామగిరి లావణ్య



**టీ మీడియా, మార్చి 30, పెద్దపల్లి:** పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా డిసిసి ఉపాధ్యక్షురాలిగా రామగిరి లావణ్య నియమితులు అయ్యారు. వివరాల్లోకి వెళ్తే పెద్దపెల్లి జిల్లా రామగిరి మండలం ముస్యాల గ్రామ మహిళ సర్పంచ్ రామగిరి లావణ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళ ఉపాధ్యక్షురాలుగా రాష్ట్ర ఐటి,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి జిల్లా మహిళా అధ్యక్షురాలు కొలిపాక సుజాత,రామగిరి లావణ్యను ఉపాధ్యక్షురాలి గా నియమించగా ఐటి శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా రామగిరి లావణ్య మాట్లాడుతూ... ఇన్ని రోజులు ప్రజాసేవలో ఉన్న తన సేవలు గుర్తించిన కాంగ్రెస్ పెద్దలు ఈ కీలక బాధ్యతను అప్పగించినందుకు తన వంతు బాధ్యతను నియమ నిబద్ధతతో నిర్వహిస్తానని తెలుపుతూ మహిళా డైనమిక్ కాంగ్రెస్ నాయకురాలు తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియా గాంధీకి ఐటి శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు కు సహకరించిన పెద్దలు పెద్దపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే విజయ రమణా రావు కు రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే మక్కన్ సింగ్ ఠాకూర్ కి పెద్దపల్లి డిసిసి జిల్లా మహిళా ప్రెసిడెంట్ కొలిపాక సుజాత కు కృతజ్ఞతాభివందనాలు తెలియజేశారు.

## బొడ్రాయికి మొక్కులు చెల్లించుకున్న ఎమ్మెల్యే



**టీ మీడియా, మార్చి 30, గోదావరిఖని:** రామగుండం కార్పొరేషన్ పరిధి విలేజ్ రామగుండం ఒకటవ డివిజన్ లో గ్రామ దేవతలు, బొడ్రాయికి శనివారం రాజ్ ఠాకూర్ మక్కాన్సింగ్ మొక్కలు చెల్లించుకున్నారు. కమిటీ వారికి తన వంతుగా 25 వేల రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామదేవతలైన శ్రీ లక్ష్మీ, శ్రీ భూలక్ష్మి అమ్మవార్ల కరుణాకటాక్షాలు రామగుండం ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని, వారికి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, రామగుండం ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కోరుకున్నానని తెలిపారు. అనంతరం రామగుండం ఒకటవ డివిజన్లో పెండింగ్లో ఉన్న నాలా పనులు రెండు కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరిపిస్తానని, రామగుండం ప్రజల అభివృద్ధికి నిరంతరం కార్యసాధన లాగా అవిశ్రాంత కృషి చేస్తూనే ఉంటానని, తనను అఖండ భారీ మెజార్టీతో గెలిపించిన రామగుండం ప్రజల రుణం తీర్చుకోలేనిదని, ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బొంతల రాజేష్, మహంకాళి స్వామి, ఎల్లయ్య, శ్రీనివాస్ తో, పాటు టౌన్ అధ్యక్షులు ఈదునూరి హరిప్రసాద్, సిసరిస్, చైర్మన్ పల్లికొండ రాజేష్, డివిజన్ అధ్యక్షులు శంకర్, రమేష్, ప్రేమ్ కుమార్, నర్సింగ్, బద్రిరాజు తోపాటు, డివిజన్ పెద్దమనుషులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతోపాటు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఏసీబీ అధికారులకు దొరికిన సబ్ ఇన్స్పెక్టర్



**టీ మీడియా, మార్చి 30,హైదరాబాద్ :** లంచం కోసం తిప్పలు పెడుతున్న సబ్ ఇన్స్పెక్టర్ పై ఫిర్యాదుదారుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేసాడు. ఇచ్చిన ఫిర్యాదును అనుసరించి రాచకొండ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు దారుడి దగ్గర లంచం తీసుకున్న సబ్ ఇన్స్పెక్టర్ ని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే ఈ%ా%.బొడ్డుపల్లి సైదులు మీర్ పేట్ పోలీస్ స్టేషన్ లో సబ్ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తున్నాడు. ఓ కేసులో నిందితుడైన మధాని సుభాష్ అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉండటానికి రూ.10వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా శనివారం పట్టుకున్నారు. సబ్ ఇన్స్పెక్టర్ ని అరెస్ట్ చేసి స్పెషల్, ఏసీబీ ప్రత్యేక న్యాయమూర్తి, హైదరాబాద్ నాంపల్లి కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. కొసమెరుపు ఏమిటంటే రెండు సంవత్సరాల క్రితం ఈ సబ్ ఇన్స్పెక్టర్ సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ లో భూమి విషయంలో లంచం తీసుకుంటూ పట్టుబడి సస్పెండ్ అయ్యారు.

## మనవడి పై తాత గొడ్డలితో దాడి



**టీ మీడియా, మార్చి 30, ధర్మారం :** ధర్మారం మండలం నంది మేడారం గ్రామానికి చెందిన సామంతుల కొమురయ్య మహేష్,రాత్రి నిద్రిస్తున్న సమయంలో తన తాత గొడ్డలి తొ మనవడు పై దాడి చేసి హత్యయత్నం చేసాడు ఈ దాడిలో మహేష్ మెడపై గాయమై తీవ్ర రక్త స్రావమై స్పృహ కోల్పోయాడు,వెంటనే 108, కి ఫోన్ చేసి, మెరుగైనా చికిత్స కోసం కరీంనగర్ లోని హాస్పటల్ కి తరలించారు. మహేష్, మేనమామ అయిన కట్ట కొమరయ్య ఫిర్యాదు మేరకు పోలీస్ లు కేసు నమోదు చేసుకొని,కుటుంబ కలహాలే కారణమని సామంతుల కొమురయ్య ను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్టు ఎస్సై టి సత్యనారాయణ తెలిపారు.

## ఓటర్లు...జర సోచాయించండ్రీ



ఎన్నికలు నగారా మ్రోగింది
రాజకీయ క్రీడ మరలా మొదలైంది..!
పకృతిని పది కాలాపాటు కాపాడే

నిస్వార్థమైన నేతను ఎన్నుకొనే సమయం
ఆసన్నమైంది..!
క్షణానికో ముఖం మార్చగల
స్వార్థ నేతలు సభలు సమావేశాల్లో
తెగ సందడి చేసే సమయం ఆసన్నమైంది..!

నేతలు ఇంటి ముంగిట సాగిలబడి
పొర్లు దండాలు పెడతూ
అన్నిటికీ మేము ఉన్నామంటూ
హామీల వర్షంలో తడిసి ముద్ద చేసే
సమయం ఆసన్నమైంది..!

ఐదు సంవత్సరాలకో సారి
తొంగి చూస్తు
వచ్చే స్వార్థ రాజకీయ నాయక మాటల మాంత్రికులు
వచ్చే సమయం ఆసన్నమైంది..!
పకృతిని పది కాలాపాటు కాపాడే
నిస్వార్థమైన నేతను
ఎన్నుకొనే సమయం ఆసన్నమైంది ఓటర్లారా ..!

మందుకి, డబ్బుకి దాసోహం కాకుండా
భావి తరాల భవిష్యత్తు గురించి ఆలోచిస్తూ...
మనం వేసే ఓటు ప్రపంచ పుటాలపై
పునాదులు అవ్వాలి .

శ్రీమతి మంజుల పత్తిపాటి (కవయిత్రి ).
చరవాణి 9347042218

# 36 గంటల దీక్ష ప్రారంభించిన మాజీ మంత్రి



**టీ మీడియా, మార్చి 30,పెద్దపల్లి బ్యూరో :** ఎన్నికల ముందు చెప్పిన మాయమాటలను నమ్మి ప్రజలు ఓట్లేసి గెలిపిస్తే.. అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ పాలన అస్తవ్యస్తంగా మారిందని మాజీ మంత్రి, పెద్దపల్లి బీఆర్ఎస్ పార్ల మెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు.రాష్ట్రంలో సాగునీరు అందక ఎండుతున్న పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ.. పెద్దపల్లి బీఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్ అధ్య క్షతన జిల్లా పార్టీ కార్యాల యంలో శనివారం 36 గంటల నిరసన దీక్షను కొప్పుల ప్రారంభించి దీక్షలో పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడు తూ%ా% రైతులకు సాగు నీరందక సుమారు 20లక్షల ఎకరాలకు పైగా పంటలు ఎండిపోయాయని తెలిపా రు. ఎండిన పంటలను చూసి రైతులు కంట కన్నీరు పెడుతున్నా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి కనిపించట్లేదా.. అని నిలదీశారు.పంటలు ఎండుతున్నా సాగునీరు సరిపడా ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. తక్షణమే పంటలకు సాగు నీరందించాలని, ఎండిన పంటలకు ఎకరాకు రూ. 25వేల చొప్పు న నష్టపరిహారం చెల్లించాల ని డిమాండ్ చేశారు. రైతు గోసను పట్టించుకోని కాంగ్రె స్ సర్కారుకు ప్రజలే తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.జిల్లాలో క్షేత్ర స్థాయిలో పర్యటించి ఎండిన పంట లను పరిశీలించామని, పెద్దపల్లి జిల్లాలో వెల ఎకరాలలో పంటలు ఎండి పోయాయని, రైతులకు భరోసా కల్పించి అండగా నిలిచేందుకే రైతులు నిర సన దీక్షను చేపట్టినట్లు పేర్కొన్నారు. తమ దీక్షతోనైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరిచి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు అధైర్య పడవద్దని, బీఆర్ ఎస్ పార్టీ ఎల్లవేళలా అండ గా ఉంటుందని భరోసా ఇచ్చారు.రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ పర్యటించి ఎండిన పంటలను పరిశీ లిస్తారని, రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రైతులకు న్యా యం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.రాష్ట్ర ప్రభుత్వం స్పందించ కుంటే రైతుల పక్షాన బీఆర్ ఎస్ పార్టీ పోరాటం చేస్తుంద ని తెలిపారు. రైతులకు అన్యాయం జరిగితే ఊరు కునేది లేదని ప్రభు త్వాన్ని హెచ్చరించారు.

## పద్మావతి ఎక్స్ప్రెస్‌లో పొగలు

- భయాందోళనకు గురైన ప్రయాణీకులు



**టీ మీడియా, మార్చి 30,ఖాజీపేట :** సికింద్రాబాద్-తిరుపతి పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదానికి గురైంది. బి4 బోగీలోని బ్యాటరీలో క్యాప్ లీక్ కావడంతో పొగలు వ్యాపించాయి. దీంతో ప్రయాణీకులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన రైల్వే సిబ్బంది హనుమకొండ జిల్లా కాజీపేట రైల్వేస్టేషన్ సమీపంలో రైలును నిలిపివేసి సహాయక చర్యలు చేపట్టారు. బి4 బోగీలోని బ్యాటరీలో క్యాప్ లీక్ కావడంతో పొగలు వస్తున్నట్లు గుర్తించిన సిబ్బంది వెంటనే మరమ్మతులు చేపట్టారు. దీంతో దాదాపు 2 గంటల పాటు రైలు నిలిచిపోవాల్సి వచ్చింది. మరమ్మతుల అనంతరం రైలు యథావిధిగా అక్కడి నుంచి వెళ్లిపోయింది. సికింద్రాబాద్ తిరుపతి పద్మావతి ఎక్స్ప్రెస్ రోజూలాగానే స్టేషన్ నుంచి బయలు దేరింది. అందరూ నిద్రలో ఉన్నారు. అయితే %దీ%4 కోచ్ లో పొగలు రావడం మొదలయ్యాయి. రైల్వే సిబ్బంది గుర్తించి కాజీపేట రైల్వేస్టేషన్ రాగానే వెంటనే రైలును నిలిపివేశారు. కాజీపేట రైల్వే టెక్నీకల్ సిబ్బంది, అధికారులు చేరుకుని పొగలు రాకుండా వాటిని మరమ్మత్తు చేశారు. ఈ ఘటనతో కాజీపేట రైల్వేస్టేషన్ లో సుమారు గంటన్నర నిలిపివేయడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. ఏం జరుగుతుందో కాసేపు ఏమీ అర్థం కాలేదు. అధికారులకు నిలదీయగా రైలులో పొగలు వ్యాపించాయని తెలుపడంతో భయాందోళనకు గురయ్యారు. అయితే భయపడాల్సిన అవసరం లేదని మరమ్మత్తు చేసినట్లు తెలపడంతో ఊపిరిపీల్చుకున్నారు. అయితే రైలులో పొగలు వ్యాపించడానికి గల కారణం బ్యాటరీ క్యాప్ లీక్ అవడంతో ఈఘటన తలెత్తిందని రైల్వే సిబ్బంది తెలిపారు. మరమ్మత్తు అనంతరం కాజీపేట నుంచి బయలు దేరింది.

## డేరా చీఫ్ హత్య కేసులో రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్



**టీ మీడియా, మార్చి 30,హైదరాబాద్ :** ఉత్తరాఖండ్‌లోని ఉధమ్‌సింగ్ నగర్‌లో ఉన్న నానక్‌మట్టా సాహిబ్ గురుద్వారాలో డేరా చీఫ్ బాబా తర్సేమ్ సింగ్ గురువారం ఉదయం హత్యకు గురైన ఘటన కలకలం రేపింది. ఈ వ్యవహారంపై దర్యాప్తు జరిపిన పోలీసులు ఓ కీలక విషయాన్ని గుర్తించారు. డేరా చీఫ్ బాబా తర్సేమ్ సింగ్ హత్యకు కుట్ర పన్నిన వారిలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి హర్వాన్ష్ సింగ్ చుగ్ కూడా ఉన్నారని వెల్లడైంది. ఈయన ప్రస్తుతం నానక్‌మట్టా సాహిబ్ గురుద్వారా మేనేజ్‌మెంట్ కమిటీ చీఫ్‌గా వ్యవహరిస్తున్నారని తేలింది. గురుద్వారా సభ్యుడు జస్వీర్ సింగ్ ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదైంది. దీనిలో మొత్తం ఐదుగురు నిందితుల పేర్లను చేర్చారు. డేరా ఆస్తులను స్వాధీనం చేసుకునే ప్రయత్నాలను అడ్డుకుంటున్నారనే ఉద్దేశంతోనే బాబా తర్సేమ్ సింగ్‌ను హత్య చేశారని ఆ ఎఫ్ఐఆర్‌లో ప్రస్తావించారు. బాబాపై కాల్పులు జరపడానికి బైక్‌పై ఇద్దరు వ్యక్తులు రాగా, బైక్ రైడర్‌ను పంజాబ్‌కు చెందిన సర్వజీత్ సింగ్‌గా గుర్తించారు. అతడి వెనుక కూర్చొని కాల్పులు జరిపిన వ్యక్తిని యూపీకి చెందిన అమర్జీత్ సింగ్‌గా నిర్ధారించారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా ఈవివరాలు వెల్లడయ్యాయి. మిగతా ఇద్దరు నిందితుల్లో తారై (సిక్కు) మహాసభ ఉపాధ్యక్షుడు ప్రీతంసింగ్ సంధు, గురుద్వారా హర్ గోవింద్ సింగ్ ప్రధాన జతేదార్ బాబా అనూప్ సింగ్ ఉన్నారు.

## పోలీసు కోర్టు డ్యూటీ సిబ్బంది సమన్వయంతో పని చేయాలి

- జిల్లా అడిషనల్ ఎస్పీ రామదాసు తేజవత్



**టీ మీడియా, మార్చి 30, వనపర్తి బ్యూరో :** జిల్లా ఎస్పీ రక్షిత కే మూర్తి ఆదేశానుసారము వర్టికల్ ట్రైనింగ్ లో భాగంగా కోర్టు డ్యూటీ వర్టికల్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ రామదాసు తేజవత్ మాట్లాడుతూ పోలీసులు, కోర్టు డ్యూటీ అధికారులు సమన్వయంతో పని చేసి నేరస్థులకు తప్పక శిక్ష పడేలా చూడాలని అడిషనల్ ఎస్పీ అన్నారు. నేరస్థులకు శిక్ష ఖరారు శాతం పెరగాలని సూచించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో కోర్టు డ్యూటీ నిర్వహించే కానిస్టేబుళ్లు, కోర్టు లైజనింగ్ ఆఫీసర్లతో అడిషనల్ ఎస్పీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్ట్ వారెంట్స్, సమన్స్, ఎంసీలు, వర్టికల్ గురించి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కోర్టు కానిస్టేబుల్ అధికారులు తమ విధిలో భాగంగా ఎప్పటికప్పుడు ఎన్‌బీడబ్ల్యూలు క్రమం తప్ప కుండా అమలుచేస్తూ నేరస్థులకు శిక్షపడేలా చేయాలని సూచించారు. ఇటీవల నేరస్థులకు కోర్టులలో శిక్షల ఖరారు శాతం పెరిగిందని, ఇందుకు కృషిచేస్తున్న పీపీలు, ఏపీపీలను అడిషనల్ ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. నిందితులపై స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైనప్పటి నుంచి కేసు పూర్తయ్యే వరకు నిందితుల నేరాలను నిరూపించేందుకు అవసరమైన ఆధారాలు, సాక్షాలు సేకరించి సాక్షుల వాంగ్మూలాలు కోర్టుకు సమర్పించడంలో కోర్టు కానిస్టేబుల్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్టికల్స్ ఇంచార్జ్ డీఎస్పీ శ్రీ కృష్ణ కిషోర్ , వనపర్తి టౌన్ ఎస్సై జయన్న మదనాపురం ఎస్సై కోర్టు మానిటరింగ్ ఏఎస్ఐ భాషా, లైజనింగ్ అధికారులు, కోర్టు డ్యూటీ కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

## పెళ్లి బృందానికి తప్పిన ప్రమాదం

- ప్రమాదంలో గొర్రెలు మృతి



**టీ మీడియా, మార్చి 30, ఎండపల్లి :** ఎండపల్లి గ్రామం నుండి పెళ్లి వ్యాను దొనబండకు వెళ్తుండగా అంబారిపేట రాజీవ్ రహదారి వద్ద మార్గమధ్యంలో పెళ్ళి వ్యానుకు గొర్రెల మంద అనుకోకుండా వ్యానుకు ఎదురుగా వెళ్లడం వల్ల వ్యాను డ్రైవర్ సమయ స్ఫూర్తితో పెళ్ళి బృందాన్ని కాపాడే ప్రయత్నంలో వ్యానుకు తగిలి ఏడు గొర్రెలు మృతి చెందాయి, సంఘటన స్థలానికి పోలీస్ లు చేరుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## మహానంది కోనేటి నీటి స్వచ్ఛతలపై శాస్త్రీయ పరిశోధనలు



**టీ మీడియా, మార్చి 30, మహానంది:** సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం మహానందిలో సహజ సిద్ధంగా, అద్భుతంగా, స్వచ్ఛతంగా వందల ఏళ్ల నాటి నుంచి ఒకే రీతి ప్రవాహ తీరుపై శాస్త్రీయ పరిశోధనలు చేస్తామని ఇంటాచ్ (ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఆర్ట్స్ కల్చర్ అండ్ హెరిటేజ్ )సంస్థ తరఫున ఇంజనీరింగ్ ప్రతినిధి డాక్టర్ సోమేష్ దుదాని పేర్కొన్నారు. శనివారం నంద్యాల ఇన్ టాచ్ సంస్థ కన్వీనర్ శివకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం జలశక్తి పర్యవేక్షణలో 2022లో నంద్యాలలో ఏర్పడిన ఇంటాచ్ ప్రత్యేక బృందం దేవస్థానం ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి తో సమీక్ష జరిపారు. ఈ సంస్థ కోనేటి నీటిని సేకరించి, శాస్త్రీయ పద్ధతిలో లేబొరేటరీలలో పరీక్షించి, నివేదికలు కేంద్రానికి, దేవాదాయ శాఖకు పంపిస్తామన్నారు. అంతర్జాతీయ స్థాయిలో మహానంది కోనేటి స్వచ్ఛత నీటికి గుర్తింపును తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నట్లుగా వివరించారు. తమ పరిశీలనలు నివేదికల ఆధారంగా, అహోబిల క్షేత్రంలో జరిగే పారువేట ఉత్సవాన్ని ప్రభుత్వం పండుగగా జీవో నెంబర్ 9 తో ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు .ఇప్పటివరకు ధవలేశ్వరం ప్రాజెక్టు, ప్రకాశం జిల్లా కంభం చెరువు ,కడప వైఎస్ఆర్ జిల్లాలోని పోరుమామిళ్ల, మన ఉమ్మడి జిల్లాల్లోని కేసికెనాలు లకు వచ్చే నీటి ప్రవాహంపై సాంకేతికంగా పరిశోధనలు చేయటం జరిగిందని వివరించారు. ఈ సమావేశంలో డాక్టర్ గెలివి సహదేవుడు ,డాక్టర్ కిషోర్, విశ్రాంత జేడి రామచంద్రయ్య, మారం శేషయ్య, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## స్వతంత్ర అభ్యర్థిగా నన్ను ఆదరించాలి

- నీరటి శంకర్

**టీ మీడియా, మార్చి30, గోదావరిఖని:** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పెద్దపల్లి పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థిగా తనను గెలిపించాలని నీరటి శంకర్ ప్రజలను కోరారు. గోదావరిఖని ప్రెస్ భవన్ లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నీరటి శంకర్, వేముల అశోక్ మాట్లాడుతూఈ ప్రాంత వాసిగా ఇక్కడి ప్రజా సమస్యలు తెలుసునని అన్నారు. ఈ ప్రాంతంలో నిరుద్యోగ సమస్యలు, రైతు సమస్యలు, కార్మికుల సమస్యలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజల సమస్యలు ఒకసారి అవకాశం ఇస్తే పరిష్కరిస్తానని శంకర్ తెలిపారు. ఈ సమావేశంలో తిరుపతి, రాజయ్య, శ్రీనివాస్, రాజు భాయ్, బానేష్, ఎండి సాబీర్, పోచం తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా జన్మదిన వేడుకలు

**టీ మీడియా, మార్చి 30, గోదావరిఖని:** పెద్దపల్లి జిల్లా కేంద్రంలో భారతీయ జనతా పార్టీ కో కన్వీనర్ గుండెబోయిన లక్ష్మణ్ యాదవ్ జన్మదిన వేడుకలు శనివారం కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. బిజెపి నాయకులు దుద్యాల ప్రదీప్ కుమార్, పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గోమాస శ్రీనివాస్, చందుపట్ల సునీల్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, కార్యవర్గ సభ్యులు షీలారపు పర్వతాలు యాదవ్, హాజరై జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. అసెంబ్లీ కన్వీనర్ దాడి సంతోష్ యాదవ్, తాతా రవి యాదవ్, సంపత్ రావు, ఎర్రోళ్ల శ్రీకాంత్, రాజమంత, ఉల్లాల తిరుపతి యాదవ్, నాగరాజు యాదవ్, మేకల శ్రీనివాస్ యాదవ్, మహేష్, సంపత్, శ్రీనివాస్, రమణ రావు, అధిక సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



## ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు

**టీ మీడియా, మార్చి 30, రేవల్లి :** మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షలు, ఈనెల 18న ప్రారంభమై శనివారం 30న ప్రశాంతంగా మూగిశాయి. మొత్తం విద్యార్థులు 167. కస్తూర్బా గాంధీ బాలికలు 37 మంది, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 129. విద్యార్థులు పరీక్షలు రాయగా, ఒక విద్యార్థి మాత్రం గైర్హాజరయ్యారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా చర్యలు తీసుకున్నమని ఇంచార్జ్ దామోదర్ రెడ్డి తెలిపారు. ప్రశాంతంగా పరీక్షలు ముగించుకున్న విద్యార్థులు ఈలలు వేస్తూ, కేకలతో ఆనందంతో పరీక్షల కేంద్రం దగ్గర సందడి చేస్తూ ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



## హిందూ, ముస్లీంలు కలిసి పండుగలు జరుపుకునే తెలంగాణ సంస్కృతి మనది

- మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు

**టీ మీడియా, మార్చి 30, సంగారెడ్డి :** సంగారెడ్డి పట్టణం జలీలియా మసీదులో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫాయిజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు టీఎస్ఐఐసీ చైర్మన్, డిసిసి అధ్యక్షులు నిర్మల జయప్రకాశ్ రెడ్డి గారితో కలిసి ఆయన ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ను ఆదరించిన మైనారిటీలు పార్లమెంట్ ఎన్నికల్లో అదేవిధంగా మద్దతు కొనసాగించి గెలుపుకు కృషి చేయాలని ఆయన తెలిపారు. మైనారిటీల అండదండలతో కాంగ్రెస్ పార్టీకి మరింత తోడ్పాటు అందుతుందని ఆయన తెలిపారు. మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ని భారీ మెజార్టీతో గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు, గ్రామ గ్రామాన కూడా కాంగ్రెస్ మరింత బలవపేతం అయి భారీ మెజార్టీ అందించబోతునారని చెప్పారు, ఈ కార్యక్రమంలో బాబా, భారిభాయి, మోహిన్, మున్ను, ఎండీ జావిద్, మోతీ, మోయిజ్, బాబ్బు,కిరణ్ గౌడ్, శ్రీ రామ్,స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముస్లిం పెద్దలు, ముస్లిం సోదరులు,కార్యకర్తలు, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.